
సాక్షి ఒడిశా

శుక్రవారం । 12 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,15,690, బంగారం 1.1 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



క్రీడా రంగంపై వివక్ష తగదు

-IIలో



ఆడంబరంగా నీలమ్మతల్లి ఉత్సవాలు

-IIలో

న్యూస్‌రీల్

నిధుల మంజూరుపై హర్షం



కళాశాల ఆవరణలో బ్యానర్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: పట్టణంలోని కృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాల, మహిళా కళాశాలకు రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్ర 5టీ కార్యదర్శి వి.కార్తికేయ పాండ్యన్ గత 2రోజులు గజపతి జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా స్థానిక కళాశాలను సందర్శించగా, మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు ఆయనను కోరారు. దీనిపై స్పందించిన పాండ్యన్.. 24 గంటల్లోనే గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు మంజూరు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ప్లస్2, ప్లస్3 విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ కళాశాల ఆవరణలో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో గజపతి వంశీయురాలు కల్యాణీదేవి గజపతి, బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, ఛత్ర బీజేడీ జిల్లా అధ్యక్షుడు బిశ్వజిత్ త్రిపాఠి, యువ జన నాయకులు శాసనం లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

132 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

బరంపురం: గంజాం–గజపతి జిల్లాల సరిహద్దు తప్పపాణి ఘాట్ రోడ్డు నుంచి బరంపురం వైపు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. బరంపురం ఎక్సైజ్ అధికారి రామచంద్ర మహంతి తెలిపిన వివరాల ప్రకారం గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి నుంచి బరంపురం మీదుగా బిహార్‌కు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన అధికారులు.. తప్పపాణి సరిహద్దు ఘాట్ రోడ్డులో మాటు వేశారు. అటుగా వస్తున్న వ్యాన్‌ను అడ్డుకొని తనిఖీ చేయగా.. 132కిలోల గంజాయి బయట పడింది. దీనిని సీజ్ చేశారు. వాహనంలో ఉన్న డ్రైవర్‌తో సహా నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. పట్టుబడిన సరుకు విలువ రూ.12 లక్షలు ఉంటాయని వివరించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం విరాళం



విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని అంబోదల గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమయ్యే 400చదరపు అడుగుల స్థలాన్ని రాయగడ లయన్స్ క్లబ్ కోశాధికారిగా వ్యవహరిస్తున్న లాడి చంద్రమౌళి విరాళంగా అందించారు. ఈ మేరకు గురువారం భూమిపూజ చేపట్టారు. రాజ్యాంగ రూపకర్త బాబాసాహెబ్ విగ్రహాన్ని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అన్ని వర్గాల ఆశాకిరణంగా గుర్తింపు పొందిన అంబేడ్కర్ ఆశయాలు భావితరాలు తెలుసుకునే విధంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మునిగుడ సమితి ఉపాధ్యక్షుడు ఆదర్శ కుసులిక, అంబోదల నాయబ్ సర్పంచ్ ప్రభాకర్ భాగ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వీడ్కోలు ఉత్సవం



విద్యార్థిని సత్కరిస్తున్న ప్రదీప్ బిశోయి

పర్లాకిమిడి: రాయఘడ సమితి బొమ్మిక పంచాయతీలో ఉన్న పరశురాం డిగ్రీ కళాశాలలో వీడ్కోలు ఉత్సవాలు గురువారం సందడిగా సాగాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ బిశోయి, కార్యదర్శి ఎస్.ప్రభాకరరావు, సలహాదారుడు బాలకృష్ణ బసువరాయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్లస్2 ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన దివాకర్ శబర, నళినీ భుయ్యాన్ లను జ్ఞాపికలతో సత్కరించి, అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చక్రాలు చకచకా..



పట్టు బిగిస్తున్న భోయి కార్మికులు

- పూరీ జగన్నాథుని రథయాత్రకు చురుగ్గా సన్నాహాలు
- కొత్త రథాల పనుల్లో భోయి సేవకులు
- చక్రాల తయారీ, అమరిక పూర్తి



చక్రం చుట్టు పనుల్లో మహరణ సేవకులు



చక్రం అమరిక తుదిదశ పనులు



అమరికకు సిద్ధమైన నాహక చక్రం

భువనేశ్వర్:

జగన్నాథుని రథయాత్ర ఆద్యంతాలు అత్యద్భుతం. జగతి నాథుడు ఊరేగే పవిత్ర రథాల తయారీ సందర్శకులను ఇట్టే ఆకటుకుంటుంది. శ్రీమందిరం సింహద్వారం ఆవరణ బొడొదండొ ప్రాంగణంలో సువిశాలంగా ఏర్పాటు చేసిన చలువ పందిరి కింద ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అక్షయ తృతీయ నుంచి ఈ పనులకు శ్రీకారం చుట్టారు. అంచెలంచెలుగా రథాల తయారీ కొనసాగుతోంది. యాత్ర కోసం 3 కొత్త రథాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఒక్కో రథానికి ప్రత్యేక వడ్రంగి సమూహం నియమితులయ్యారు. చలువ పందిరి కింద యాత్ర రథాల తయారీ పని విభజనకు నిలువుటద్దం. నిత్యం ఉదయం 8 గంటల నుంచి వడ్రంగి సమూహం ఈ పనుల్లో చేరుతుంది. సాయంత్రం చీకటిపడే వరకు నిరవధికంగా శ్రమిస్తుంది. సాయంత్రానికి హెచ్చు తగ్గులు లేకుండా 3 రథాల దశలవారీ పనులు సమానంగా పూర్తి చేయడం దీనికి తార్కాణం.

ఒక్కో అమరికలో..

రథాల తయారీలో తొలుత చక్రాల తయారీ పనుల్ని ప్రారంభిస్తారు. ఈ క్రమంలో తొలుత తుంబ రూపు దిద్దుకుంటుంది. తదుపరి వీటికి అమర్చే రేకులు(స్పోక్సు), చుట్టు(రిమ్) తొలి విడత పూర్తయ్యే సమయంలో చక్రాలపై నిలిపే అంతస్తుల మూల స్తంభాల తయారీకి శ్రీకారం చుడతారు. ఈ దశ పూర్తయ్యే లోగా రథ అంతస్తులు నిలిపే నాహక(ఛెసిస్) తయారీ ప్రారంభిస్తారు. రథం నడిబొడ్డున నాహక కింద అమర్చే 4 చక్రాల పనులను తొలుత ముగిస్తారు. ఈ దశ పనులు ఆదివారం పుంజుకున్నాయి. ఒక్కో రథానికి 2 చొప్పున నాహక చక్రాల తయారీ మహరణ సేవకుల సమూహం పూర్తి చేసింది. అలాగే ప్రతి రథానికి అవసరమైన మిగిలిన 2 నాహక చక్రాల్లో ఒక్కో చక్రం తయారీకి అవసరమైన కొలతల ప్రక్రియని ముగించారు. ఈ లెక్కన బలభద్రుని తాళధ్వజం, దేవీ సుభద్ర దర్పదళనం, జగన్నాథుని నందిఘోష్ రథానికి 2 చొప్పున నాహక చక్రాల తయారీ పూర్తి చేశారు.

184కి పెరిగిన కార్మికులు..

రథాల తయారీ పనుల్లో వడ్రంగులు, రూపకారులు, కమ్మర్లు, సహాయక కార్మికులు వగైరా సిబ్బందిని క్రమపద్ధతిలో నియమిస్తారు. పనుల ఒత్తిడి పెరుగుతున్న కొద్దీ వడ్రంగి తదితర కార్మికుల నియామకం పుంజుకుంటుంది. ఆదివారం నాటికి సమగ్రంగా వీరి సంఖ్య 184కి చేరింది. వీరిలో 78మంది మహరణ సేవకులు, 63మంది భోయి సేవకులు, నలుగురు రంపం కార్మికులు, 17మంది కమ్మరి కార్మికులు, ఒక్కొక్కరు చొప్పున తుంబ, చుట్టు కొలతల కార్మికులు, 19మంది రూపకారులతో వీరందరికీ తాగునీరు సరఫరా ఇతరేతర తేలికపాటి ఉపచారాల కోసం ఒక కార్మికుడు ఉన్నారు. వీరంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరవధికంగా శ్రమించడం విశేషం. మహరణ, భోయి, కమ్మరి కార్మికులను పెంచడంతో 177మంది రథ తయారీ కార్మికుల పరిమితి.. క్రమంగా 184కి పుంజుకుంది.

ప్రొఫెసర్ సుధాకర్ పండాకు
బిజూ సైంటిఫిక్ ఎక్సలెన్స్ అవార్డు

- వివిధ కేటగిరీల్లో అవార్డులు ప్రకటించిన ఒడిశా విజ్ఞాన అకాడమీ



ప్రొఫెసర్ సుధాకర్ పండా

భువనేశ్వర్: నగరంలోని నైజర్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ పండా 2020 సంవత్సరానికి గాను 'బిజూ పట్నాయక్ అవార్డ్ ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్' అందుకోనున్నారు. అవార్డు కింద రూ.2 లక్షల నగదుతో ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆమోదంతో 2020 సంవత్సరానికి శాస్త్రవేత్తలకు ఒడిశా విజ్ఞాన అకాడమీ(ఓవీఏ) వివిధ అవార్డులను ప్రకటించింది. కటక్ రెవెన్షా విశ్వ వద్యాలయం నుంచి ప్రొఫెసర్ లూనా సామంత, స్థానిక సీఎస్ఐఆర్–ఐఎంఎంటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ దండా శ్రీనివాసరావు, రౌర్కెలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)కి చెందిన ప్రొఫెసర్ అనూప్కుమార్ పండా, లక్నో నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సరోజ్కాంత్ బారిక్ సామంత చంద్రశేఖర్ అవార్డుకు ఎంపికయ్యారు. వీరికి ప్రశంసాపత్రం, జ్ఞాపికతో పాటు రూ.లక్ష నగదు బహుమతి అందిస్తారు.

యువ శాస్త్రవేత్తలు, రచయితలకు..

ఐసీఎంఆర్–ఆర్ఎంఆర్సీకి చెందిన డాక్టర్ శశాంకశేఖర్ స్వాయి, రౌర్కెలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన డాక్టర్ జ్ఞానరంజన్ సేనాపతి, స్థానిక నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ నిబేదితా దాస్, డాక్టర్ సత్యప్రసాద్ పి.సేనానాయక్ లకు యువ శాస్త్రవేత్తల విభాగంలో అవార్డులకు ఎంపిక కావడం విశేషం. ప్రొఫెసర్ సంగీతా సేకహర్, హిమాన్షు శేఖర్ ఫతేసింగ్ ప్రాణ కృష్ణ పరిజా పాపులర్ సైన్స్ బుక్ అవార్డు అందుకోనున్నారు. యువ శాస్త్రవేత్తలు, రచయితలకు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో పాటు రూ.25,000ల నగదు పురస్కారం అందజేస్తారు. ప్రొఫెసర్ భాస్కర్ దాస్, సంజుక్తా దాస్, ప్రొఫెసర్ సత్యానంద స్వాయి, ప్రొఫెసర్ అజయ్కుమార్ పాత్రొ సీనియర్ శాస్త్రవేత్తల సత్కారానికి నామినేట్ అయ్యారు. త్వరలో జరగనున్న వైజ్ఞానిక అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ప్రత్యేక సత్కారాలు అందుకుంటారు.

వసతులు కల్పించాలని ఆందోళన



బీడీఓ కార్యాలయం ముందు ఆందోళన చేపడుతున్న లోక్ వికాశమంచ్ సభ్యులు

జయపురం: సమితిలోని అన్ని పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, బడులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని లోక్ వికాశమంచ్, మహిళా లోక్ వికాశమంచ్ ప్రతినిధులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు జయపురం సమితి కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టడంతో పాటు వినతిపత్రం అందించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో సర్వే నిర్వహించామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలు తెలుసుకున్నామన్నారు. గ్రామీణ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వీటిని అభివృద్ధి సైతం చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండటంతో విద్యార్థులు గుణాత్మక విద్యకు దూరం అవుతున్నారని వాపోయారు. దీనిపై దృష్టి సారించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిదీ



ప్రసంగిస్తున్న కేసీసీబీ చైర్మన్ ఈశ్వర్‌చంద్ర పాణిగ్రహి

- కేసీసీ బ్యాంకు చైర్మన్ ఈశ్వర్ పాణిగ్రహి



సమావేశంలో పాల్గొన్న ఎండీలు, డైరెక్టర్లు

రాయగడ: దేశానికి వెన్నెముకగా గుర్తింపు పొందిన రైతులకు సకాలంలో సాయం అందించి, ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఈశ్వరచంద్ర పాణిగ్రహి అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడటంతో పాటు వారికి విరివిగా వ్యవసాయ రుణాల మంజూరు చేయడంతో ద్వారా ఊరట కల్పించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బ్యాంకు జయపురం శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందిస్తే అభివృద్ధి దానంతట అదే సాధ్యడుతుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. రైతు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే వారికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. రూ.లక్ష రుణం తీసుకున్న వారికి వడ్డీ లేకుండా, రూ.3 లక్షల వరకు సాధారణ వడ్డీకే రుణాలు అందించాలని కోరారు. పంట చేతికి వచ్చిన వెంటనే సకాలంలో వాయిదాలు చెల్లించేలా మేనేజర్లు, డైరెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనితో పాటు విత్తనాలు, నాణ్యమైన ఎరువులు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 13 ల్యాంప్ సహకార సంఘాలు, ఎంపీసీఎస్ కార్యాలయం ఉండగా.. ఈ ఏడాది మరో 82ల్యాంప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు బి.తిరుపతిరావు, జగన్నాథ సుంద్రుక, బృందావన్ సబర్, చక్రధర్ బిడిక, వివిధ సహకార సంఘాల సభ్యులు, ఎండీలు పాల్గొన్నారు.

జేపీఎల్–2 క్రికెట్ టోర్నీ ప్రారంభం



ప్రారంభ మ్యాచ్ సందర్భంగా క్రీడాకారులు, అతిథులు



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎస్‌డీపీఓ హరీష్

జయపురం: ఆటలలో యువత ప్రధాన భూమిక నిర్వహించాలని జయపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారి హరీష్ బిసి పిలుపునిచ్చారు. పట్టణంలోని విక్రమ్ క్రీడా మైదానంలో(దసరా పాడియా) ఓరియన్ క్రికెట్ క్లబ్ జయపురం ఆధ్వర్యంలో నిర్వహించిన జయపురం ప్రీమియర్ లీగ్(జేపీఎల్)2 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రికెట్ అంతర్జాతీయ ఆటని, ఇందులో స్థానిక చెందిన యువత ప్రతిభ కనబరిచి, జిల్లాను క్రీడారంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. మరోవైపు తొలి మ్యాచ్‌లో మౌంటెన్ బాయ్స్–ధాల్ వారియర్స్ జట్లు తలపడ్డాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ధాల్ వారియర్స్ టీం నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. చిన్మయ పండా 46 బంతుల్లో 73 పరుగులు, దినేష్ హల్వ 28 బంతుల్లో 46 పరుగులతో రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనలో బ్యాటింగ్ ప్రారంభించిన మౌంటెన్ బాయ్స్ టీమ్ 10 వికెట్లు కోల్పోయి 139 పరుగులు మాత్రమే చేయగలిగింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన చిన్మయ పండాకు బహుమతితో పాటు రూ.వెయ్యి అందజేశారు. ఎంపైర్‌గా ఆశిత్ పట్నాయక్, రమేష్ స్వాయ్ వ్యవహరించారు. కార్యక్రమంలో మహ్మద్ ఇసాక్, స్కోకర్ యువరాజ్, జేపీఎల్–2 చైర్మన్ బాబుల రౌత్, ఓరియన్ క్లబ్బు కార్యదర్శి, జేపీఎల్ కోర్ కమిటీ సభ్యులు సుభాష్ రౌత్, అనూప్ పాతకనొ, రబి నాయిక్, కమిటీ సభ్యులు కార్తీకరౌత్, సచ్చిదానంద పారిడ, బీపీ పారిడ, రాంప్రసాద్ గంతాయత్, మనోజ్ పాడి, బాలరాయ్, బలరాం పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు జయపురం రాయల్స్..

జేపీఎల్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో జయపురం రాయల్స్ జట్టు విజయం సాధించింది. అవెంజర్స్, జయపురం రాయల్స్ టీమ్‌ల మధ్య జరిగిన పోటీ ఉత్కంఠ భరితంగా జరిగింది. టాస్ ఓడి, బ్యాటింగ్‌కు దిగిన ఏంజిల్స్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసింది. అనంతర లక్ష్య ఛేదనలో రాయల్ జట్టు చక్కని ఆట ప్రదర్శించి 18.1 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసి ఘనవిజయం సాధించింది.

ఈవీఎంలు భద్రం

- స్ట్రాంగ్‌రూమ్‌కు ఝార్సుగుడ ఉప ఎన్నిక ఈవీఎంల తరలింపు
- 13న ఉదయం 8గంటల నుంచి కౌటింగ్ ప్రక్రియ



స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రంగా ఉన్న ఈవీఎంలు



సీసీటీవీ నిఘాలో స్ట్రాంగ్‌రూమ్

భువనేశ్వర్: ఝార్సుగుడ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధం అవుతోంది. మూడంచెల భద్రతా ఏర్పాట్లుతో స్ట్రాంగ్రూంలో ఈవీఎంలను సీల్ చేశారు. ఝార్సుగుడ ఇంజినీరింగ్ స్కూల్ ఆవరణలో వీటి కోసం స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటు చేశారు. ఈవీఎంలు, వీవీప్యాట్ మిషన్లు పటిష్ట భద్రతతో భద్రపరిచారు. మూడంచెల భద్రతా వ్యవస్థ మధ్య ఈ యంత్రాలు భద్రంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. సీసీటీవీ స్కానర్లలో ఈవీఎంలు, వీవీప్యాట్ మెషీన్లపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. స్ట్రాంగ్రూమ్ ప్రాంగణమంతా సీసీటీవీ స్కానర్ కింద ఉంటుందని తెలిపారు. ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం తొలి అంచెలో కేంద్ర రిజర్వుడ్ పోలీసు దళం(సీఆర్పీఎఫ్), రెండో అంచెలో రాష్ట్ర సాయుధ బలగాలు(ఓఎస్ఏఎఫ్), మూడో అంచెలో జిల్లా పోలీసులతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ముందస్తు అనుమతి లేకుండా ఏఒక్కరూ ఈ గది తెరవడం, ప్రవేశించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఝార్సుగుడ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన స్ట్రాంగ్రూమ్ భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఎన్నికల జనరల్ పర్యవేక్షకుడు డీకే తివారీ, ఝార్సుగుడ సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్ట్రాంగ్రూమ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

రేపు ఓట్ల లెక్కింపు..

ఝార్సుగుడ ఉప ఎన్నిక పోలింగ్ బుధవారం శాంతియుతంగా ముగిసింది. ఈ సందర్భంగా పోలైన ఓట్ల లెక్కింపు ఈనెల 13న నిర్వహిస్తారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుంది. 14 టేబుళ్లపై 18 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఉదయం 8 గంటల నుంచి లెక్కిస్తారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతుందని ఝార్సుగుడ కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కౌటింగ్ పూర్తిచేసి, విజేతను ప్రకటించేలా ఏర్పాట్లు ముమ్మరం చేశామని పేర్కొన్నారు.

ఝార్సుగుడలో 79.21శాతం పోలింగ్

భువనేశ్వర్: ఝార్సుగుడ నియోజకవర్గ ఉప ఎన్నికల పోలింగ్ తుది వివరాలను రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ వెల్లడించింది. బుధవారం జరిగిన ఈ ప్రక్రియలో సమగ్రంగా 79.21శాతం ఓటింగ్ నమోదైందని ఎన్నికల సంఘం సీఈఓ నికుంజ బిహారీధొలా తెలిపారు. ఝార్సుగుడ 2019 సార్వత్రిక ఎన్నికల్లో 75.62శాతం పోలింగ్ జరిగింది. ఈ లెక్కన ఈసారి పోలింగ్ పెరిగినట్లు స్పష్టం అవుతోంది. బుధవారం నియోజకవర్గంలో మొత్తం 253 కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు నిరవధికంగా కొనసాగింది. ఉప ఎన్నికలో మొత్తం 1,51,035మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు. మూడు పోలింగ్ బూత్‌లలో స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. అయితే ఓటింగ్‌లో ఎలాంటి అవాంతరాలు జరగలేదని సీఈఓ స్పష్టంచేశారు. పోలింగ్ జరిగిన 253 కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్ నిర్వహించారు. ఈ ఏడాది జనవరి 29న స్థానిక ఎమ్మెల్యే, మాజీమంత్రి నవకిషోర్ దాస్ హత్యకు గురైన నేపథ్యంలో ఉప ఎన్నిక జరిగిన విషయం తెలిసిందే.

క్లుప్తంగా

సంపాదిత సెలవు మంజూరుకు వినతి

శ్రీకాకుళం న్యూకాలనీ: వేసవి సెలవుల్లో విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకుగాను ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి రిక్వెస్ట్ పేరిట ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలపై ఏపీటీఎఫ్ తరఫున గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పుడు పనిచేయడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే ఉపాధ్యాయులు వెకేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందినవారని, సెలవు దినాల్లో పని చేసినందుకు ప్రయోజనాలు అందేలా ప్రొసీడింగ్స్ విడుదల చేయాలని కోరారు.

14న మోడల్ లాసెట్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని కొన్నావీధిలో ఏపీఆర్ లా కాలేజీలో ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు మోడల్ లాసెట్ నిర్వహించనున్నట్లు ఏపీ బీసీ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగురు ఉమామహేశ్వర రావు, చౌదరి లక్ష్మణరావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3, 5 ఏళ్ల లాసెట్‌కు సంబంధించి మోడల్ టెస్ట్ ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వివరాలకు ఏపీబీసీ అడ్వకేట్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ లక్ష్మణరావు(9640780728) ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

20లోగా స్టోన్ ప్లాంటేషన్ పూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 20 నాటికి స్టోన్ ప్లాన్‌టేషన్ పనులు పూర్తి చేయాలని భూ పరిపాలన కమిషనర్ సిద్ధార్థ జైన్ కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న రెండో విడత రీసర్వే స్టోన్ ప్లాంటేషన్ పనులపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసర్వే పూర్తయిన గ్రామాల్లో హక్కు పత్రాలు పంపిణీ చేయాలన్నారు. కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ స్టోన్ ప్లాంటేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సర్వే భూ రికార్డులసహాయ సంచాలకులు కె.ప్రభాకర్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

నరసన్నపేట: మండలంలోని రావాడపేట వద్ద జాతీయ రహదారిపై ఈ నెల 4న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుంచాల మల్లేశ్వరరావు(39) గురువారం మృతి చెందాడు. జలుమూరు మండలం బసివాడకు చెందిన మల్లేశ్వరరావు చెన్నైలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సారవకోట మండలం కిన్నెరవాడలో సమీప బంధువులు అమ్మవారి పండగలకు ఆహ్వానం పంపితే వచ్చాడు. పండగలు ముగిశాయి. చెన్నైకి తిరుగు ప్రయాణం రెండు రోజుల్లో చేస్తాడనగా ప్రమాదం జరిగింది. స్వగ్రామం నుంచి నరసన్నపేటకు ఈ నెల 4న ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. వెంటనే 108లో ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. అక్కడ్నుంచి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమంగా మారడంతో స్వగ్రామం బసివాడకు తీసుకువచ్చారు. ఇంటి వద్ద గురువారం మృతి చెందారు. మల్లేశ్వరావుకు భార్య సుశీల, ఇద్దరు కుమారులు ఉన్నారు. నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను అభినందిస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా రెడ్ క్రాస్ సంస్థ సేవలను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలబెట్టిన కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు శ్రీకేష్ బి.లాఠకర్‌ను ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు గురువారం అభినందించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శాలువతో సత్కరించారు. రెడ్‌క్రాస్ ప్రగతికి వర్సిటీ తనవంతు కృషి చేస్తుందన్నారు.

'మహాయజ్ఞానికి తరలిరండి'

టెక్కలి: భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణ, రాష్ట్రాభివృద్ధి, ప్రజల సుఖ శాంతులు, పాడి పంటల సమృద్ధి కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలో దేవదాయ శాఖ పర్యవేక్షణలో విజయవాడలో నిర్వహించనున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి తరలిరావాలని దేవదాయ ధర్మాదాయ శాఖ ఈఓ వీవీఎస్ నారాయణరావు గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 17 వరకు అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

క్రీడారంగంపై వివక్ష తగదు

- క్రీడాశాఖ అధికారిపై ఏడీఎంకు క్రీడాకారుల ఫిర్యాదు



ఏడీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న క్రీడాకారులు

రాయగడ: క్రీడారంగానికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ రాయగడ జిల్లాలో మాత్రం సంబంధిత శాఖ అధికారులు తమపై వివక్ష చూపిస్తున్నారని పలువురు క్రీడాకారులు ఆరోపించారు. ఈ మేరకు జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద బెహరాను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలో క్రీడాకారులను సభ్యులుగా చేర్చించి, వెంటనే క్రీడా సంఘాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ ఆదేశాలు జారీ చేశారని, ఈ విషయమై క్రీడాశాఖ అధికారి షేక్ ఆలినూర్ మాత్రం సంఘాల ఏర్పాటుకు సంబంధించి మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. క్రీడా సంఘంలో సభ్యులయ్యేందుకు వార్షిక రుసుం రూ.10లు చెల్లించాలని నిబంధన ఉన్నప్పటికీ సుమారు రూ.వెయ్యి చెల్లించాలని క్రీడాశాఖ అధికారి ఉత్తర్వుల్లో పేర్కొనడం విచారకరమన్నారు. పేద వర్గానికి చెందిన క్రీడాకారులను సభ్యులుగా చేర్పించేందుకు విముఖత చూపిస్తున్నారని, దీనిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి సంబంధించి ఈనెల 21న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నోసులు జారీ చేసిన క్రీడాశాఖ అధికారి.. అదేరోజు నామినేషన్ల ఉపసంహరణ, పరిశీలనకు గడువు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో క్రీడాకారుడు బాడింగి చంటి, ఎం.చందు, కె.హరీష్, బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడంబరంగా నీలమ్మతల్లి ఉత్సవాలు



కలశాలతో మందిరానికి వెళ్తున్న భక్తులు

పర్లాకిమిడి: స్థానిక పట్టణంలో గ్రామదేవత నీలమ్మతల్లి ఉత్సవాలు ఆడంబరంగా జరుగుతున్నాయి. మహిళలు గురువారం ఘటాల అనుపోత్సవం చేపట్టారు. పసుపు నీళ్లతో చల్లదనం జరిపి, ఎస్‌కేసీజీ కళాశాల రోడ్డులోని అమ్మవారి మందిరం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పర్లాకిమిడి లోని పలు వీధులలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి.



ఘటయాత్రలో అమ్మవారి ఊరేగింపు

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృత్యువాత



పోలాకి ఈశ్వరరావు(ఫైల్)

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన పోలాకి ఈశ్వరరావు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4న జాడు పల్లిలో జరిగిన ఓ శుభకార్యానికి పెద్దక్ష్మీపురం గ్రామానికి చెందిన కొర్లరాజేష్, పోలాకి ఈశ్వరరావు కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి స్వగ్రామాని కి వస్తున్న సమయంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయారు. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యా యి. రాజేష్‌ను పలాసలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించగా, ఈశ్వరరావు(27) తలకు గాయం కావడంతో శ్రీకాకుళంలోని జెమ్స్‌లో చికిత్స అందించి రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికి త్స పొందుతూ ఈశ్వరరావు గురువారం మృతి చెందాడు. ఈశ్వరరావుకు తల్లిదండ్రులు నారాయణ, తేజమ్మ, సోదరి ఉన్నారు.

ఉపాధి పనిచేస్తూ వేతనదారుడు మృతి

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేటకు సీపాన రాజారావు(60) ఉపాధి పని చేస్తూ గురువారం మృతి చెందాడు. గ్రామ పరిధిలోని తురకవాని చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపడుతుండగా సాయంత్రం ఒంట్లో ఇబ్బందిగా ఉందని గ్రూపు మేట్‌కు తెలియజేశాడు. విశ్రాంతి తీసుకోవాలని మేట్ సూచించిన కొద్దిసేపటికే గట్టుపైకి వస్తూ ఒక్కసారిగా చెరువు నీటిలో పడిపోయాడు. తోటి వేతనదారులు వెంటనే బయటకు తీసినప్పటికే మృతి చెందాడు. రాజారావుకు భార్య తవిటమ్మ, వివాహితులైన కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

లలితాదేవికి చందనంతో అలంకరణ



లలితాదేవి అమ్మవారికి చందనంతో అలంకరించిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని మొండేటివీధిలోగల శ్రీ షిరిడి సాయిబాబా స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శ్రీలలితాదేవి అమ్మవారికి ఆ ఆలయ అర్చకులు సుగంధ ద్రవ్యాలు, పాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చందనంతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్‌పై పోలీసులకు ఫిర్యాదు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని అచ్చుతాపురం గ్రామానికి చెందిన ఎం.రామారావు, ఎం.లక్ష్మీనారాయణ, ఎం.జోగారావు, ఎం.వెంకటరమణలు 2010లో తనకు తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని పర్లాకిమిడికి చెందిన జయశ్రీ పాడి ఫిర్యాదు చేసినట్లు పాతపట్నం పోలీసులు తెలిపారు. 2010లో ఈ నలుగురు కలిసి ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేశారని, కానీ రిజిస్టర్ అయిన స్థలం అక్కడ లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ నలుగురిలో ఎం.వెంకటరమణ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారని, గతంలో కూడా ఇతనిపై రెండు ఫిర్యాదులు వచ్చాయని, ఇదే విషయం డీఈఓ, ఎంఈఓలకు ఉపాధ్యాయుడు విషయం తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.

పాఠశాల పరిశీలన



పాఠశాల సిబ్బందితో సమీక్ష చేపడుతున్న డీఈఓ తిరుమల చైతన్య

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేసి పాఠశాలలో విద్యా వికాసానికి కృషి చేయాలని డీఈఓ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందితో సమీక్ష ని ర్వహించారు. ప్రభుత్వం పాఠశాల విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని, ప్రతి విద్యార్థికీ ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందించి రోల్ మోడల్‌గా తయారు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాల స్టోర్ రూమ్‌లను పరిశీలన చేసి పాఠశాలకు సరఫరా చేసిన జగనన్న విద్యా కానుక కిట్‌లను, పాఠ్య పుస్తకాలను పరిశీలించి ప్రతి విద్యార్థికీ అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.తులసీరావు, స్థానిక హెచ్ఎం తారకేశ్వర పండా, కె.రమణ, టి.భోజరాజు, గజేంద్ర, శ్రీను, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు స్వాగతం



సైకిల్ యాత్రికులను అభినందిస్తున్న జేసీఐ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ఆడపిల్లలను రక్షించాలి, వారి ఉన్నత చదువులకు ఊతం ఇవ్వాలి, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలనే లక్ష్యంతో విశాఖకు చెందిన ముగ్గురు యువకులు విశాఖ పట్టణం నుంచి నేపాల్ వరకూ సైకిల్ యాత్ర ప్రారంభించారు. దారిలో కనిపించిన వారందరికీ అవగాహన కల్పిస్తూ సాగుతున్నారు. ఈ యాత్ర తాజాగా శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి గురువారం చేరుకుంది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జేసీఐ సన్ రైజర్స్ సభ్యు లు ఈ ముగ్గురు యువకులకు ఘన స్వాగతం పలికారు. శ్రీకాకుళం చేరుకున్న ఈ యువకులను జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అధ్యక్షులు జేసీ వినోద్ కుమా ర్, జేసీ దూసి సంతోష్, జేసీఐ సభ్యులు యువకులను స్వాగతించారు. అనంతరం జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అడ్వైజర్ జేసీ గీత శ్రీకాంత్ విశాఖ యువకులు చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు. కార్యక్రమంలో జేసీ ప్రవీణ్‌కుమార్, జేసీ శ్రవణ్‌కుమార్, జేసీ వెంకటేష్, జేసీ దామోదర్, జేసీ సాయి దయాల్, జేసీఐ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీసత్య జ్యూయలర్స్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న అంధవరపు ప్రసాద్, సంతోష్

శ్రీకాకుళం అర్బన్: నాణ్యమైన బంగారు ఆభరణాలకు చిరునామాగా శ్రీసత్య జ్యూయలర్స్ నిలుస్తోందని వ్యాపారవేత్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులు అంధవరపు ప్రసాద్, అంధవరపు సంతోష్ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని పెట్రోమాక్స్ వీధిలో గురువారం శ్రీసత్య జ్యూయలర్స్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 65 ఏళ్లుగా వ్యాపార రంగంలో ఉంటూ ప్రజల నమ్మకాన్ని చూరగొనడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పేర్ల సాంబమూర్తి, కామేశ్వరి బుక్స్ అండ్ స్టేషనరీ ప్రతినిధి ఊన్న కృష్ణమూర్తి, శ్రీసత్య జ్యూలయర్స్ యజమాని వి.ఎ.కృష్ణారావు, రాధాశైలజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి చెస్ పోటీలు



విజేతలతో చెస్ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని పీఎన్‌కాలనీలో న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. 30 మంది క్రీడాకారులు హాజరుకాగా.. అందులో 12 మంది ఇంటర్నేషనల్ రేటెడ్ క్రీడాకారులు ఉండటం విశేషం. ఐదు రౌండ్ల పాటు ఉత్కంఠభరితంగా పోటీలు కొనసాగాయి. ఐదు రౌండ్లకుగాను నాలుగున్నర పాయింట్లు సాధించిన శ్రీకాకుళం యూనియన్ బ్యాంక్ మేనేజర్ చంద్రమౌళి విజేతగా నిలిచారు. మందసకు చెందిన లోకేష్ ద్వితీయ స్థానంలో నిలవగా, గీత చెస్ అకాడమీ కోచ్ అభినవ్ తృతీయ స్థానం, శ్రీకాకుళంకు చెందిన సాయి వెంకట్ నాలుగో స్థానం, రామప్పడు ఐదో స్థానం, లక్ష్మణ్ ఆరో స్థానంలో నిలిచారు. వీరికి నగదు బహుమతి, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మహిళల విభాగంలో బొల్లా శృతి ప్రథమ స్థానంలో నిలవగా, సత్యవతి ద్వితీయ, అమృత వర్షిణి తృతీయస్థానం, మేఘన నాలుగో స్థానంలో నిలిచారు. వీరంతా ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఏపీ చెస్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్, కార్యదర్శి జామి రమేష్, టోర్నమెంట్ డైరెక్టర్ వైఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఐసీడీఎస్ పీడీ జి.జయదేవి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐసీడీఎస్ పరిధిలో జిల్లాలో ఖాళీగా ఉన్న 63 అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకు లు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ పోస్టులు 17, అంగన్‌వాడీ హెల్పర్స్ పోస్టులు 45, మినీ అంగన్‌వాడీలు పోస్టులు 1 కలిపి మొత్తంగా 63 పోస్టులు భర్తీ చేయనున్నారు. అర్హులైన మహి ళా వివాహిత అభ్యర్థులు ఈనెల 12వ తేదీ నుంచి సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలకు దరఖాస్తులను అందచేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారు జూలై 1, 2022 నాటికి 21–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి స్థానికులై ఉండాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, అంగన్‌వాడీ సహాయకులకు, మినీ అంగన్‌వాడీలకు 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరుతేదీ ఈనెల 19వ తేదీ సాయంత్రం 5గంటల లోపు అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గమనించాలని జయదేవి కోరారు.

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

- ఆటోను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం
- ఇద్దరు మహిళలు మృతి
- మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన నాగమణి

టెక్కలి రూరల్(కోటబొమ్మాళి): కోటబొమ్మాళి మండలం వాంఢ్రాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తులసిపేట కాలనీకి చెందిన కిర్రు నాగమణి(32), జలుమూరు మండలం పెద్ద దూగాం గ్రామానికి చెందిన కె.రాములమ్మ (60), నైరా గ్రామానికి చెందిన కె.అశోక్‌లు గురువారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ రాజపురంలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెలమపేటకు చెందిన కె.చిన్నబాబు ఆటోలో కలిసి వెళ్లారు. కార్యక్రమం అనంతరం తిరిగి వస్తుండగా వాంఢ్రాడ సమీపంలోకి వచ్చే సరికి గుర్తుతెలియని వాహనం వీరి ఆటోను అతివేగంగా వచ్చి ఢీకొని వెళ్లిపోయింది. ఆటో రెండుసార్లు పల్టీలు కొట్టడంతో నాగమణి అక్కడికక్కడే మృతి చెందింది. రాములమ్మతో పాటు అశోక్, చిన్నబాబులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ఆసుపత్రి సమీపంలో రాములమ్మ మృతిచెందింది. మిగిలిన ఇద్దరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో మృతిచెందిన నాగమణి భర్తతో విడాకులు తీసుకుని ఇద్దరు చిన్న కుమార్తెలతో ఒంటరిగా ఉంటోంది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ తరుణంలో నాగమణి మృతి చెందడంతో పిల్లలు అనాథలుగా మారారు. ఈ ఘటనపై కోటబొమ్మాళి ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు.

అందరి బంధువు



- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



మనిషిని మనిషి ముట్టుకోవడానికే భయపడిన కరోనా కాలంలో అందరికీ ఆమె అమ్మయ్యింది. రక్తమోడిన శరీరాన్ని తాకడానికి జంకే సమయాల్లో ఆమె తల్లిలా ఎందరికో సేవలు చేసింది. అర్ధరాత్రి, అపరాత్రి అన్న తేడా లేకుండా అవసరం అన్న ప్రతిసారీ దేవతలా ప్రత్యక్షమైంది. పేగు తెంచుకుని పుట్టే పసికందులకు కనిపించే మొదటి రూపం ఆమెదే. ప్రాణాల మీదకు వచ్చినప్పుడల్లా వినిపించే ధైర్య వచనం కూడా ఆమెదే. ఆమె పేరు 'నర్సు'. ఎలాంటి రక్త సంబంధం లేకపోయినా అందరి బంధువు. అందరి మంచిని కాంక్షించే నర్సులను గుర్తు తెచ్చుకుని వారి సేవలను మనసారా ప్రశంసించే రోజు ఇది. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా కొందరు సిస్టర్లు తమ మర్చిపోలేని అనుభవం గురించి వివరించారిలా..

– ఇచ్ఛాపురం రూరల్

ప్రాణం పోయే పరిస్థితిలో...



పాతికేళ్ల మత్స్యకార మహిళకు కుటుంబ నియంత్రణ చేసిన 20 రోజుల తర్వాత ఆమె ఇంటి వద్దనే కుట్లు విప్పి మా ఇంటికి వచ్చేశాను. రాత్రి 8 గంటల సమయంలో ఫోన్ వచ్చింది. కుట్లు వద్ద కడుపులో గల పేగులు బయటకు వచ్చేశాయని అవతలి వారు చెప్పారు. ప్రాణాపాయ స్థితిలో ఉందని, వెంటనే రావాలంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఏం చేయాలో పాలుపోలేదు. రహదారి అంతగా బాగా లేదు. మా ఆయన కూడా వైద్య సిబ్బంది కావడంతో హుటాహుటిన బైక్‌పై వెళ్లాం. తుమ్మును నియంత్రించుకోలేక గట్టిగా తుమ్మడం వల్లనే కుట్లు పేలిపోయి పేగులు బయటకు వచ్చినట్లు గ్రహించాం. అప్పటికే ఆమె శ్వాస తీసుకోవడం కష్టంగా మారింది. మరికొంత ఆలస్యం అయితే జరగరాని ఘోరం జరిగిపోయేది. ఆ సమయంలో ధైర్యం చేసి ఆమెకు చికిత్స చేసి మళ్లీ కుట్లు వేయడంతో పాటు తెల్లారే వరకు ఆమె వద్దనే ఉంటూ సపర్యలు చేశాం. మూడేళ్ల క్రితం జరిగిన ఈ సంఘటన నా జీవితంలో మరిచిపోలేనిది.

– ఎం.కమల, నర్సు, ఈదుపురం, ఇచ్ఛాపురం మండలం


ధైర్యం చేసి.. ప్రాణం పోసి



42 ఏళ్ల వయసు వ్యక్తి గుండెపోటుతో ఆస్పత్రిలో చేరాడు. అతడిని ఐసీయూలో ఉంచి సంబంధిత గుండె వైద్యులు పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ఆ రోజు నా డ్యూటీ. అనుకోకుండా ఆయన ఉండే ఐసీయూలోకి వెళ్లాను. ఆయనకు మళ్లీ గుండెపోటు వచ్చినట్లు గమనించాను. దీంతో క్షణం కూడా ఆలస్యం చేయకుండా సీపీఆర్ చేశాను. ఆయన కోలుకున్నాక వెంటనే సంబంధిత వైద్యు డిని పిలిచి చికిత్స అందించాం. ఆ రోజు వైద్య సిబ్బందితో పాటు, ఆయన కుటుంబ సభ్యులు నన్ను ఎంతగానో మెచ్చుకున్నారు. ఒక నిండు ప్రాణాన్ని కాపాడడం ఎప్పటికీ మర్చిపోలేను.

– టెంక కృష్ణవేణి, నర్సు, ఇచ్ఛాపురం


తల బయటకు వచ్చేసింది..



రెండు నెలల కిందట జరిగిన సంఘటన ఇది. ఆ రోజు ఆస్పత్రిలో డ్యూటీలో ఉండగా రాత్రి సమయంలో పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే ఆమె బాధతో విలవిలలాడుతోంది. బంధువులు మాత్రం ధీమాగా ఉన్నారు. వెంటనే ఆమెను గదిలోకి తీసుకువెళ్లిన నేను పరిస్థితిని అంచనా వేసే లోపు బిడ్డ తల బయటకు వచ్చినట్లు గ్రహించాను. బిడ్డను పూర్తిగా ప్రసవించేందుకు ఆమె నరకయాతన అనుభవిస్తోంది. వెంటనే ప్రసవం చేసేందుకు వైద్య చేవలు మొదలు పెట్టాను. పండంటి మగ బిడ్డ పుట్టాడు. అప్పటి వరకు నరకయాతన అనుభవిస్తున్న తల్లి, ఆందోళన పడ్డ నేను ఆ బిడ్డను చూసి మా శ్రమను మర్చిపోయా.

– చల్లా నాగశ్రీ, నర్సు, ఇచ్ఛాపురం

నర్సులు లేని వైద్యసేవలు లేవు



కుల–మత విభేదాలు లేకుండా, పేద–ధనిక తేడా చూడకుండా, సేవా నిరతితో రోగులకు మేమున్నామంటూ సేవలు అందిస్తున్నారు నర్సులు. రోగులను ఓదారుస్తూ, ఆత్మీయంగా పలకరిస్తూ, సపర్యలు చేస్తూ, వారికి సమయానికి తగ్గట్టు మందులు ఇస్తూ వారు అందిస్తున్న సేవ ఎనలేనిది. ఆస్పత్రుల్లో నర్సులు లేకపోతే ఎలాంటి వైద్య సేవలు కొనసాగవు.

– డాక్టర్ మీనాక్షి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, శ్రీకాకుళం

క్లుప్తంగా

హాకీ పోటీల్లో సత్తా చాటిన తులసి



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న తులసి

వేపాడ: మండలంలోని బానాది గ్రామానికి చెందిన కుప్ప తులసి(14) 13వ జాతీయ హాకీ పోటీల్లో సత్తా చాటింది. రాష్ట్రం తరఫున ఆడి తులసి పంజాబ్, గుజరాత్‌లను తన ప్రతిభతో ఓడించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను రెండుసార్లు అందుకున్న తులసి పలువురు ప్రశంసలు అందుకుంటోంది. గ్రామానికి చెందిన కుప్ప గోవింద, లక్ష్మి దంపతుల కుమార్తె తులసి కడప జిల్లా వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈ నెల 4 నుంచి 14వ తేదీవరకు ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలలో నిర్వహించిన 13వ హాకీ ఇండియా సబ్ జూనియర్ ఉమెన్ నేషనల్ చాంపియన్ షిప్ 2023లో రాష్ట్రం తరఫున ఆడి రెండు పర్యాయాలు నిర్వాహకుల చేతుల మీదుగా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా తులసిని బానాది గ్రామస్తులు అభినందిస్తున్నారు.

హౌసింగ్ పీడీగా అదనపు బాధ్యతలు



హౌసింగ్ పీడీగా అదనపు బాధ్యతలు చేపట్టిన రమేష్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా హౌసింగ్ పీడీగా రమేష్ గురువారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు హౌసింగ్ పీడీగా చేసిన రఘురాం దీర్ఘకాలిక సెలవు తీసుకున్నారు. ఆయన స్థానంలో పాలకొండ సబ్‌డివిజన్ హౌసింగ్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌కు అదనపు బాధ్యతలు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. జగనన్న లేఅవుట్లలో త్వరితగతిన ఇళ్ల పనులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సిబ్బందిని ఆదేశించారు.

ట్రాఫిక్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన విశ్వనాథ్

విజయనగరం క్రైమ్: ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా డి.విశ్వనాథ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా మూడు సంవత్సరాలు పని చేసిన ఎల్.మోహనరావు రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో వెయిటింగ్‌లో ఉన్న డి.విశ్వనాథ్‌ను ట్రాఫిక్ డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ డీఎస్పీగా బాధ్యతలు చేట్టిన విశ్వవాథ్ పోలీసుశాఖలో డైరెక్ట్ డీఎస్పీగా 2018 బ్యాచ్ (గ్రూప్ 1)కు చెందినవారు. గతంలో శ్రీకాళహస్తి డీఎస్పీగా సమర్థవంతంగా పని చేసి, అధికారులు, ప్రజల మన్ననలు పొందారు.

రైల్లో నాలుగు తులాల బంగారం చోరీ

కొత్తవలస: టాటా నుంచి కోయంబత్తూరు వెళ్తున్న ప్రత్యేక ట్రైన్‌లో విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలానికి చెందిన ఎం.మధు నాలుగు తులాల బంగారం చోరీకి గురవడంతో రైల్వే పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. దీనిపై రైల్వే ఎస్సై వికాస్‌నాయక్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కుటుంబ సభ్యులతో కలిసి మధు కోయంబత్తూరు వెళ్లే ప్రత్యేక ట్రైన్‌ను కొత్తవలస స్టేషన్‌లో బుధవారం రాత్రి 8.26 గంటలకు ఎక్కారు. దువ్వాడ స్టేషన్ వద్దకు వెళ్లే సరికి బ్యాగ్ తెరిచి ఉండడాన్ని గమనించి చూడగా అందులో గల నాలుగు తులాల బంగారం ఆభరణాలు కనిపించలేదు. దీంతో అదే స్టేషన్‌లో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పునరావాస కేంద్రంలోకి ఇతరులను రానీయొద్దు

- ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



శాంతి నివాస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీ స్టేట్ బాలల హక్కులు పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

బొండపల్లి: పునరావాస కేంద్రంలోనికి ఇతరులను రానీయొద్దని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కేంద్ర నిర్వాహకులకు సూచించారు. బొండపల్లి మండలం ఒంపల్లి గ్రామంలోని బ్రైట్ ఫ్యూచర్ శాంతి నివాస్ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. వసతి, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో సదుపాయాలు ఉండడంపై సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో విజయనగరం పట్టణ సీఐ బెండి వెంకటరావు, సత్య కాలేజీ ఎన్‌సీసీ అధికారిణి మీసాల సత్యవేణి, కేంద్ర నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న మామిడి పండ్లు

- నోరూరించి..అనారోగ్యానికి హేతువుగా మారుతున్న పండ్లు
- కృత్రిమంగా ముగ్గబెట్టి విక్రయం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నష్టపోతున్న కొనుగోలు దారులు

నిష్ఫలం..!

రాజాం సిటీ/పాలకొండరూరల్: మార్కెట్‌లో విక్రయిస్తున్న పండ్లు చూస్తే ఇట్టే కొనాలపిస్తుంది. వాటిని చూడగానే బంగారం రంగులో నిగనిగలాడుతూ విక్రయదారులను ఆకట్టుకుంటున్నాయి. రద్దీగా ఉండే పట్టణాల్లో వాటి విక్రయాలు జోరందుకుంటున్నాయి. పైన పటారం..లోన లొటారం మాదిరిగా మారుతూ ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్నాయి. అన్ని పట్టణ కేంద్రాలతోపాటు గ్రామాల్లో కూడా జోరుగానే మామిడి పళ్ల వ్యాపారం సాగుతోంది. అయితే వాటిని వ్యాపారులు కృత్రిమంగా ముగ్గబెట్టి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో బాగున్నాయని కొనుగోలు చేసిన మామిడిపండ్లు ఇంటికెళ్లి తినగానే దానిపైన రసాయనంతోపాటు లోపల పురుగులు కూడా బయపడుతున్నాయి. మోసపోయామంటూ నిట్టూర్చడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి.

రసాయనాలతోనే మగ్గింపు

సంప్రదాయ పద్ధతిలో పండ్లను మగ్గిస్తే తినే కొద్దీ తినాలనిపించేది ఒకప్పటి మాట. ఇప్పుడు ఒక్కసారి తింటే ఈ ఏడాదికి ఇది చాల్లే అన్న పరిస్థితి వచ్చేసింది. ఎక్కువగా మామిడితోటలు ఉన్న ప్రాంతాల నుంచి వ్యాపారులు కాయలను దిగుమతి చేసుకుని గోదాముల్లో భద్రపరిచి మగ్గిస్తున్నారు. వేసవికాలం వచ్చిందంటే చాలు మామిడికాయల గోదాములు సిద్ధం చేసి అక్కడే మగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కార్బైట్, ఇతర రసాయనాల వినియోగంతో వేగంగా పక్వానికి వచ్చి కాయలు బంగారు రంగులోకి మారుతున్నాయని పలువురు వాపోతున్నారు. తొందరగా కాయలను మగ్గించి సొమ్ము చేసుకునేందుకు ఇదంతా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాయలు బాగున్నాయని కొనుగోలు చేసుకున్నవారికి దాంట్లో రుచి ఏమాత్రం ఉండకపోవడంతో మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సంప్రదాయ పద్ధతికి స్వస్తి

గతంలో పండ్లను మగ్గించేందుకు సంప్రదాయంగా సహజ పద్ధతులను పాటించేవారు. మామిడికాయలతోపాటు, అరటి తదితర కాయలను కూడా గడ్డిలో వేసి ముగ్గబెట్టి ఊదరపెట్టేవారు. కాయలు చెట్లలో ముదిరి పక్వానికి వచ్చిన తరువాత వాటిని కోసి సాంబ్రాణి పొగ, పీచు పొగ తదితర వాటితో సహజ పద్ధతిలో మగ్గించేవారు. అలా చేయడంవల్ల పండ్ల రుచి బాగుండేది. ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ పాత విధానానికి స్వస్తి పలికి ఎప్పుడు తీసిన కాయలను ఆరోజే మగ్గించి విక్రయాలకు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రభావం ప్రజల ఆరోగ్యంపై పడుతోంది.

తినలేకపోతున్నాం..

> చూడగానే నోరూరించే రంగులో కనిపిస్తున్నాయి. రసాయనాల ద్వారా మగ్గిస్తున్నారని తెలిసినప్పటికీ ఏడాదికోసారి అని కొనుగోలు చేస్తున్నాం. మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న మామిడి పండ్లు రుచిగా ఉండడంలేదు.
>
> ఎం.ఈశ్వరరావు, రాజాం

అధికారులు స్పందించాలి..

> రసాయనాల ద్వారా పండించి విక్రయిస్తున్న పండ్ల గోదాములపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. పండ్ల మగ్గింపులో వ్యాపారులకు అవగాహన కల్పించడంతోపాటు ప్రజారోగ్యాన్ని కాపాడాలి.
>
> జి.త్రినాథరావు, రాజాం

ఆరోగ్యంపై ప్రభావం..

> పండ్లు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. కానీ పండ్లను ముగ్గబెట్టేందుకు, రంగు వచ్చేందుకు కాల్షియం కార్బైడ్, రసాయనాలు వాడడంవల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. ప్రధానంగా జీర్ణకోశ వ్యాధులు రావడంతోపాటు నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. ప్రజలు మంచి పండ్లను తీసుకోవాలి.
>
> డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మి, సూపరింటెండెంట్, ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం.

సచివాలయ ప్రారంభానికి చర్యలు చేపట్టాలి



సోపేరు సచివాలయంలో హిమోగ్లోబిన్ టెస్టును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

- కలెక్టర్ నాగలక్ష్మి ఎస్

రాజాం సిటీ: మండల పరిధి సోపేరుగ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం ఈ నెలాఖరులోగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం మండల పరిధి సోపేరు గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆమె నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం, శ్లాబ్ దశలో ఆగిపోయిన రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను పరిశీలించారు. ఆఖరుదశలో నిర్మాణంలో సచివాలయాన్ని ఈ నెలాఖరునాటికి ప్రారంభించాలని, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలను రెండు నెలల్లో పూర్తిచేయాలని పంచాయతీరాజ్ డీఈ యు.జయప్రకాశ్‌ను ఆదేశించారు. ప్రస్తుతం నిధుల కొరత లేదని త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కొంతమంది సిబ్బందిని యూనిఫాంతో ఎందుకు హాజరుకాలేదని అడగడంతో సచివాలయ కార్యదర్శులకు సరిపడా యూనిఫాం సరఫరా కాలేదని మండల అధికారులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి సరఫరాకు చర్యలు చేపడతామన్నారు.

ఆరోగ్య సేవలపై ఆరా

గ్రామంలో స్వచ్ఛసంకల్పంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, పన్నుల వసూలు తదితర అంశాలపై ఆరా తీశారు. సచివాలయం ద్వారా గ్రామంలో అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరోగ్య కార్యకర్తను అడిగితెలుసుకున్నారు. స్వయంగా హిమోగ్లోబిన్ టెస్టును పరిశీలించారు. అనంతరం బొద్దాం గ్రామంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి చెల్లింపులు జరగలేదని కొంత మంది లబ్ధిదారులు వివరించారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సామూహిక గృహప్రవేశాలకోసం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా చర్యలు చేపట్టాలని హౌసింగ్ ఏఈ వేణుగోపాల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.అప్పారావు, ఎంపీఈఓ బాసూరి శంకరరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ సాయికామేశ్వరరావు, ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై ఆకస్మిక దాడులు

- ఆరు మండలాల్లో రూ.25.3 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



విజయనగరం మండలంలోని దుప్పాడలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలను సీజ్ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ల బృందం

విజయనగరం అర్బన్: చౌక డిపోల ద్వారా అందజేస్తున్న నాణ్యమైన పీడీఎస్ బియ్యం పేద, బడుగు వర్గాల వినియోగంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. గతంలో మాదిరిగా నాణ్యత లేని బియ్యమని మభ్యపెట్టి లబ్ధిదారుల నుంచి డీలర్లు అక్రమంగా కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలకు డిప్యూటీ తహసీల్దార్లతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గురువారం జిల్లాలోని ఆరు మండలాల్లో నిర్వహించిన దాడుల్లో డీలర్ల వద్ద 25.30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వలు పట్టుబడడంతో వాటిని సీజ్ చేసినట్లు జిల్లా పౌర సరఫరాల యంత్రాంగం ప్రకటించింది. అలాగే ఎల్‌కోట మండలం గనివాడ డీలర్‌పై డిసిప్లినరీ కేసు నమోదు చేశారు. బియ్యం అక్రమ రవాణా, అక్రమ నిల్వలు వంటి అంశాలపై కేసులు బుక్ చేశారు. మండలాల వారీగా చూస్తే ఎల్‌కోట మండం గనివాడలో 3 క్వింటాళ్లు, మెంటాడ మండలం జయితిలో 7, విజయనగరం మండలం దుప్పాడలో 4, కేఎల్‌పురంలో 4.30, జామి మండలం కుమరాంలో 4, రాజాం మండలం వస్త్రపురి కాలనీలో 3, క్వింటాళ్లు పట్టుబడడంతో డీలర్లపై చర్యలు తీసుకున్నారు. తొలిరోజున ముగ్గురేసి డిప్యూటీ తహసీల్దార్లతో ఏర్పడిన 5 బృందాలు ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి.

25లోగా దరఖాస్తు చేసుకోవాలి

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలోని గొల్లపేట వద్ద గల ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహిస్తున్న పరీక్షకు ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓబీసీ విద్యార్థులు 01.09.2011 నుంచి 31.08.2013 మధ్య జన్మించి ఉండాలన్నారు. అదే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 01.09.2009 నుంచి 31.08.2013 మధ్య పుట్టి ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఓబీసీ విద్యార్థులు రూ.150.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. వచ్చే నెల 11న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రగతి కొనసాగాలి

- మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ డీవీజీ

విజయనగరం: కేంద్రం విడుదల చేసిన 'ఇండియా -2023 స్కిల్ రిపోర్ట్' ప్రకారం ఉపాధి అవకాశాల కల్పనలో దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాలుగో స్థానం పొందడం అభినందనీయమని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ డీవీజీ శంకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మనకన్నా ముందున్న ఉత్తరప్రదేశ్,మహారాష్ట్ర, ఢిల్లీలకు పెద్ద పట్టణాలుండడం వల్ల అనుకూలతలున్నాయని..విభజన తర్వాత హైదరాబాద్ లాంటి మహా నగరం దూరమై ఆదాయం తగ్గిపోయిందన్నారు. కరోనా పరిస్థితులు మరికొంత ఆర్థిక రంగాన్ని దెబ్బతీయడం వంటి ప్రతికూలతను అధిగమించి ఉపాధికల్పన, ఉద్యోగాల సృష్టిలో రాష్ట్రం ముందుకు దూసుకుపోవడం గొప్ప విషయమన్నారు. ప్రత్యేకించి ప్రగతిపై దృష్టి పెట్టి సమగ్ర కార్యాచరణకు పూనుకోవడం అభినందనీయమన్నారు. ఉద్యోగార్థుల ప్లేస్‌మెంట్స్‌లో, ఇంటర్న్ షిప్ అందించడంలో రాష్ట్రం మొదటి స్థానం పొందడమే కాకుండా, మూడేళ్లలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఏ రాష్ట్రంలోనూ జరగలేదన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు.

ప్రభుత్వం సాధించిన సత్ఫలితాలు



డీవీజీ శంకరరావు

ఒక వైపు ప్రభుత్వ విద్య, వైద్య రంగాల్ని పటిష్టం చేస్తూనే, పెట్టుబడుల్ని ఆకర్షించడం, ప్రైవేట్ రంగంలో కూడా ఇతోధికంగా ఉపాధి అవకాశాలు లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వం సాధించిన సత్ఫలితాలుగా పేర్కొన్నారు. దేశ జనాభా ప్రపంచంలోనే అత్యధిక స్థాయికి చేరుకున్న తరుణంలో యువత ఎక్కువగా ఉన్నప్పుడు వారిని ప్రపంచ స్థాయి నిపుణులుగా తీర్చిదిద్దితేనే ప్రయోజనం ఉంటుందని, అందుకోసం ప్రాథమిక స్థాయి విద్య మొదలు ఉన్నత విద్య అనంతరం ఉండాల్సిన నైపుణ్యాల వరకూ అందించే బాధ్యత ప్రభుత్వమే తీసుకుని, ప్రోత్సహించే వాతావరణం కల్పించే బాధ్యత కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రగతి గమనం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పలుప్రాంతాల్లో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆయా ప్రమాదాలపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

గజపతినగరం: మండలంలోని కాలంరాజు పేట గ్రామానికి చెందిన దార సుధాకర్ (33) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు మృతుడి తల్లి దార రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగరాజు గురువారం సాయంత్రం తెలిపారు. సుధాకర్ నిత్యం కూలి పనులు చేస్తూ మద్యం తాగుతూ ఉంటాడని, ఇంట్లో నుంచి కొంత నగదు బుధవారం రాత్రి పట్టుకుపోయి మద్యం ఎక్కువగా తాగి చనిపోయినట్లు ఫిర్యాదులో తల్లి రాములమ్మ పేర్కొంది. మృతుడు సుధాకర్‌కు భార్య భవాని, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చెరువులో పడి యువకుడు..



వేపాడ: లక్ష్మణరావు మృతదేహం

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం గ్రామానికిచెందిన కొింకోట లక్ష్మణరావు (31) గ్రామ సమీపంలో చెరువులో పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన లక్ష్మణరావు కులవృత్తి (రజక) చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గడిచిన జనవరి నుంచి లక్ష్మణరావుకు ఫిట్స్ వస్తున్నాయి. గురువారం ఉదయం సమీపంలో ఉన్న చెరువువద్ద బట్టలు ఉతికేందుకు వెళ్లాడు. చెరువులోకి వెళ్లినప్పుడు ఫిట్స్ రావడంతో చెరువులో ఉన్న గుంతలో పడిపోయి ఊపిరాడక చనిపోయాడు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గొర్రెల కాపరి చూసి గ్రామస్తులకు సమాచారం అందించడంతో సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు చెరువువద్దకు చేరుకున్నారు. దీనిపై మృతుడు లక్ష్మణరావు భార్య కొింగకోట చిన్నమ్మ ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్సై రాజేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతిచెందిన లక్ష్మణరావుకు భార్య చిన్నమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్..



డెంకాడ: మరణించిన లారీ డ్రైవర్ వెంకటేశన్

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ పంచాయతీ పరిధిలో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. లారీతో ఇసుకను స్టాక్ పాయింట్ వద్దకు తెచ్చిన డ్రైవర్ కె.వెంకటేశన్ (43) అన్‌లోడ్ చేసి ముందుకు వచ్చే క్రమంలో పైన ఉన్న విద్యుత్ లైన్ తగిలింది. దీంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే విజయనగరం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని ఎస్సై మహేష్ తెలిపారు.

రైలు ఢీ కొని మహిళ..



పార్వతీపురం: మృతురాలు గీత గోష్ల ఐడీ కార్డు

పార్వతీపురం: కొమరాడ మండలం కూనేరు-రామభద్రపురం దరి ఉలిపిరి రైల్వేగేటు సమీపంలో రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. అస్సాం రాష్ట్రంలోని సోనిత్‌పూర్ జిల్లా, రంగపరా నియోజకవర్గం, ధులపడుంగ్ చాహ్ భగీచ పట్టణానికి చెందిన గీత గోష్ల(46)గా మృతురాలి దగ్గర ఆధారాలు లభించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గడిచిన రెండు రోజులుగా ఆమె ఈపరిసరాల్లో మతి స్థిమితం లేకుండా తిరుగుతున్నట్లు స్థానికుల సమాచారం. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువత చెడు అలవాట్లకు బానిసలు కావద్దు

- ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఆస్మా ఫర్హీన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఏఎస్పీ ఆస్మా ఫర్హీన్

విజయనగరం రూరల్: యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అడిషనల్ ఎస్పీ ఆస్మా ఫర్హీన్ హితవు పలికారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఎస్ఈబీ, ప్రభుత్వ ఐటీఐ, సెట్విజ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ క్రైమ్, మహిళల అక్రమరవాణాపై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ యువతీ, యువకులు చెడు అలవాట్లకు లోనుకావద్దని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ప్రేమ పేరుతో మోసం చేసేవారికి దూరంగా ఉండాలని సూచించారు. అమ్మాయిలను ఈవ్‌టీజింగ్ చేయరాదని, లోన్‌యాప్‌ల ద్వారా సైబర్ క్రైమ్ చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చెడు అలవాట్లకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్షలతో పాటు వారి జీవితం నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు వారి లక్ష్యాలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసై మానసిక రుగ్మతలకు గురవుతున్నారని, తల్లిదండ్రులు వారిపై పెట్టుకున్న నెరవేర్చాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ, సెట్విజ్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

19న సీతంపేటలో మెగా జాబ్‌మేళా

పార్వతీపురంటౌన్: సీతంపేటలో ఈ నెల 19న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. తన కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. రాష్ట్ర నైపుణ్యావృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా 10వ తరగతి, యూజీ, పీజీ కోర్సుల్లో ఉత్తీర్ణులై, 18-30 సంవత్సరాల మధ్య వయసున్న నిరుద్యోగయువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీతంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. జాబ్‌మేళాకు 12 కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెప్పారు.

ఆసక్తి కలిగిని నిరుద్యోగయువతీ-యువకులు తమ వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ హెచ్‌టీటీ://డబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్‌లు, ఒక పాస్‌ఫొటో ఉదయం 09 గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 70320 60773, 63051 10947 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రూరల్: ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లలో 2023 సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కన్వీనర్, విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు వారి వివరాలు వెబ్‌సైట్‌లో నమోదుచేసుకున్న అనంతరం ప్రవేశాల సమయంలో యూనిక్ సంఖ్యతో కూడిన ప్రింట్‌ను సమర్పించాల్సి ఉంటుందన్నారు. వెల్డర్, ప్లంబర్, డ్రెస్ మేకింగ్, స్వీయింగ్ టెక్నాలజీ, పెయింటర్, కార్పెంటర్ ట్రేడ్‌లకు ఎనిమిదో తరగతి పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మిగిలిన ట్రేడ్‌లకు పదోతరగతి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో ఏడాది కోర్సుకు 300 ఖాళీ సీట్లు ఉండగా, రెండేళ్ల కోర్సులలో ప్రవేశాలకు 312 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రైవేటు ఐటీఐలలో ఏడాది కోర్సులలో 1176 సీట్లు ఖాళీ ఉండగా, రెండేళ్ల కోర్సుల్లో 3,112 సీట్లు ఖాళీగా ఉన్నట్టు వెల్లడించారు.

ఇళ్ల లబ్ధిదారులకు విద్యుత్ పరికరాలు

- 18 రకాల వైరింగ్ సామగ్రి అందజేత



వైరింగ్ సామగ్రి బాక్సు

విజయనగరం ఫోర్ట్: ఇళ్ల నిర్మాణాలకు మేలు చేసేవిధంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జగనన్న కాలనీలు, సొంతస్థలంలో ఇల్లు నిర్మించుకున్న వారంతా పేద, మధ్యతరగతి ప్రజలే. ప్రస్తుతం నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరగడంతో వాటి ప్రభావం ఇళ్ల నిర్మాణాలపై పడుతోంది. నిర్మాణ సామగ్రి ధర పెరగడంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్కువ ధరకే లబ్ధిదారులకు నిర్మాణ సామగ్రి అందిస్తోంది. ఇప్పటికే సిమెంట్, ఐరన్ లబ్ధిదారులకు అందించింది. అదే విధంగా ఇసుకతో పాటు ఇళ్లనిర్మాణాలు చేస్తున్న వారికి వైరింగ్ సామగ్రిని మంజూరు చేస్తోంది.

వైరింగ్ కిట్‌లో 18 రకాల వస్తువులు

విద్యుత్ వైరింగ్ కిట్‌లో 18 రకాల విద్యుత్ సామగ్రి ఉంటుంది. పీవీసీ ఫ్లెక్సిబుల్ కాపర్ వైర్ (1ఎస్క్యూ ఎంఎం) 45 మీటర్లు, పీవీసీ కాపర్ వైర్ (2.5 ఎస్క్యూ ఎంఎం) 30 మీటర్లు, మాడ్యూల్ మెటల్ బాంక్సులు-2, మాడ్యూల్ ఫ్రేమ్ ప్లేట్‌లు-2, 1ఎం మాడ్యూల్ స్విచ్‌లు 11, 2ఫిన్ వన్ ఎంసాకెట్స్ 5, 2ఎం మాడ్యుల్ సాకెట్-1, సీలింగ్ ప్లేట్స్ -2, ఫ్యాన్ రెగ్యులేటర్-2, 4వే డబుల్ డోర్ డిస్ట్రిబ్యూషన్ బోర్డు-1, ఎంసీబీ 16ఎలు-2 తదితర సామగ్రి అందజేస్తున్నారు.

వైరింగ్ సామగ్రిపై లబ్ధిదారుల ఆసక్తి

ప్రభుత్వం అందించే వైరింగ్ సామగ్రి నాణ్యంగా ఉండడంతో పాటు తక్కువ ధరకే అందించడంతో ఇళ్ల లబ్ధిదారులు ఆసక్తి చూపుతున్నారు. 18 రకాల వైరింగ్ సామగ్రిని ప్రభుత్వం రూ.5,730కి అందిస్తోంది. వాటితో పాటు ప్రతి ఇంటి లబ్ధిదారుడికి రూ. 2వేలు విలువ చేసే మీటర్ బోర్డు, సర్వీస్ వైరు ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది.



నిర్మాణంలో ఉన్న ఇళ్లు

అందుబాటులో వైరింగ్ సామగ్రి

> ఇళ్ల నిర్మాణం చేస్తున్న వారికి ప్రభుత్వం విద్యుత్ వైరింగ్ సామగ్రిని అందిస్తోంది. ఇందులో 18 రకాలు ఉంటాయి. అలాగే విద్యుత్ మీటర్, ప్యానల్ బోర్డు, సర్వీస్ వైర్ ఉచితంగా అందజేస్తాం.
>
> పి.నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ